

ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకున్న అధికారులు

చేగుంట, జనవరి 29: ప్రభుత్వ భూమి కబ్జా ప్రయత్నాన్ని యత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. నార్సింగి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 490లో ప్రభుత్వ భూమి ఉన్నది. ఆ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని నిర్మాణ పనులు చేపట్టడానికి యత్నించారు. ఈ విషయంపై స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ కరీం, సర్వేయర్ శ్రీకాంత్ వెళ్లి పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ నా ఆత్మబంధువులే

- ఎవరు ఆపదలో ఉన్నా సాయం చేస్తా
- జగ్గారెడ్డి ఓట్ల కోసమే ఏదీ చేయడని ప్రజలకు తెలుసు
- పదేళ్లలో నేనేం చేశానో..
  9 ఏళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో కళ్ల ముందు ఉన్నది
- గెలిస్తే సంగారెడ్డి అభివృద్ధికి సీఎంను నిధులడిగే వాడిని
- త్వరలో కార్యకర్తలతో సమావేశమవుతా
- మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 29: సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ తన ఆత్మబంధువులని, తానెప్పుడూ వారిని ఓటర్లుగా చూడలేదని మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో తనకు ఓట్లేసిన 70వేల మందికి తానే జవాబుదారీగా ఉంటానన్నారు. తనకు ఓట్లేయని 80వేల మందికి కూడా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జగ్గారెడ్డి ఓట్ల కోసం ఏదీ చేయడనే విషయం సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని, ఎవరు ఆపదలో ఉన్నా చేతనైన సాయం వెంటనే చేస్తానని అన్నారు. ఒకసారి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని, రెండుసార్లు ఓడిపోయానని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాను చెప్పినట్టుగానే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. తాను ఓడిపోయినప్పటికీ ప్రజల ఆలోచన మేరకు పనిచేస్తానని వెల్లడించారు. దసరా, బోనాలు, శ్రీరామ నవమి, శివరాత్రి, వినాయక చవితి పండగల నిర్వహణ కోసం సంవత్సరానికి రూ. 8 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు ఖర్చు చేస్తుంటానని తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షల్లో ఇఫ్తార్ విందులు, క్రిస్మస్ పండగకు కేక్‌లు ఇచ్చి సంతృప్తి చెందుతానని అన్నారు. ఓట్ల కోసమే అయితే ఇన్ని కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తానని, ఎన్నికల సమయంలో ఖర్చు చేస్తే సరిపోతుంది కదా? అని పేర్కొరు. ఆలాగే ఎక్కడ జాతరలు, పండుగలకు పిలిచినా ఉత్త చేతులతో ఏనాడూ వెళ్లలేదని స్పష్టం చేశారు. తాను పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా వున్నప్పుడు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేశానో ప్రజలందరికీ తెలుసని అన్నారు. 2014లో తాను ఓడిపోయినా సంగారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం పోరాటం చేశానని గుర్తుచేశారు. 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మెడికల్ కాలేజీని సాధించానని పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం సంగారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని జగ్గారెడ్డి విమర్శించారు. తనను గెలిపించి ఉంటే సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లి సంగారెడ్డి అభివృద్ధి కోసం నిధులు తీసుకువచ్చేవాడినని, కానీ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని అడగాలో ప్రజలు ఆలోచించాలని అన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ప్రజలు కోరుకునే పనులు చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని, అనంతరం ప్రజలందరినీ కలుస్తానని తెలిపారు.

ఆరు గ్యారంటీ స్కీంలకు దరఖాస్తు చేసుకోండి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంల కోసం నియోజకవర్గ ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలని జగ్గారెడ్డి సూచించారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే సంగారెడ్డి రాంనగర్‌లోని తన కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తన భార్య నిర్మలారెడ్డి నియోజకవర్గంలో పనులన్నీ చూసుకుంటున్నారని, ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులందరూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.



మహిళా సంఘాలకు అందని
రూ.6.23 కోట్ల బకాయిలు

రెండేళ్లుగా అందని ధాన్యం కొనుగోళ్ల కమీషన్

సంగారెడ్డి టౌన్, జనవరి 29: రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల సేకరించిన వడ్లకు సంబంధించి కమీషన్ డబ్బులు మహిళా సంఘాలకు రెండేళ్లుగా అందడం లేదు. 2022 నుంచి మూడు సీజన్‌లకు సంబంధించి రావాల్సిన కమీషన్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మహిళా సంఘాలకు కమీషన్ చెల్లించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

19,47,671 క్వింటాళ్ల ధాన్యం సేకరణ

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఐకేపీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి జిల్లాలో 2023 నుంచి మూడు సీజన్‌లలో ప్రభుత్వం ఐకేపీ ద్వారా 19,47,671 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించింది. 2022-23 వానాకాలంలో 14,722 మంది రైతుల నుంచి 7,25,304 క్వింటాళ్లు, అదే సంవత్సరం యాసంగిలో 12,367 మంది రైతుల నుంచి 5,43,612 క్వింటాళ్లు, 2023-24 ఖరీఫ్‌లో 13,130 మంది రైతుల నుంచి 6,78,755 క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించారు.

రూ. కోట్లలో బకాయిలు

సంగారెడ్డి జిల్లాలో 2022-23 ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు 2023-24 ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లపై ఐకేపీ మహిళా సంఘాలకు రూ.6.23 కోట్లు కమీషన్ చెల్లించాల్సి ఉన్నది. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు 2022-23 వానాకాలంలో 101 కొనుగోలు కేంద్రాలు, యాసంగిలో 79 కేంద్రాలు, 2023-24 వానాకాలం సీజన్‌లో 85 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ద్వారా ధాన్యాన్ని సేకరించారు. మహిళా సంఘాలకు కమిషన్ రూపంలో క్వింటాలుకు రూ. 32 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రూ.6.23 కోట్లు కమీషన్ మహిళా సంఘాలకు అందాల్సి ఉన్నది. ఇందులో 2022-23 వానాకాలంలో రూ.2.32 కోట్లు, యాసంగిలో రూ. 1.739 కోట్లు, 2023-24 వానాకాలంలో రూ.2.17 కోట్లు రావాల్సి ఉన్నది. మూడు సీజన్ల కమీషన్ విడుదల చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

గొల్లకురుమలను మోసం చేసిన కేసీఆర్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధరయాదవ్



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గొల్లకురుమ లబ్ధిదారులు

మెదక్ అర్బన్, జనవరి 29: సబ్సిడీ గొర్రెలను అందిస్తామని గొల్లకురుమలను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఆరోపించారు. లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు వడ్డీకి డబ్బులను తీసుకొచ్చి డీడీలు చెల్లించారన్నారు. యూనిట్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ సర్కారు రెండేళ్ల కాలయాపన చేసిందని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా 1,942 మంది డీడీలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గొర్రెల యూనిట్లను వెంటనే అందజేయాలని, లేదంటే కట్టిన డబ్బులను వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, యాదవ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, సెక్రటరీ బాల్‌రాజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్
ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- ఫిబ్రవరి 1 నుంచి 15వ వరకు మూడు దశల్లో నిర్వహణ
- సంగారెడ్డి జిల్లాలో 95 కేంద్రాలు, మెదక్ జిల్లాలో 35 పరీక్ష కేంద్రాలు

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, జనవరి 29: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ పూర్తి చేసింది. మూడు విడతల్లో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్స్ కమిటీలను కూడా నియమించారు. ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు మూడు దశల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రతీ రోజు రెండు సెషన్లు

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు మూడు దశల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. 1వ తేదీ నుంచి 15 వరకు ప్రతీరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. సంగారెడ్డి జిల్లాలో 95 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఇంటర్ జనరల్ 77 కేంద్రాలు, ఒకేషనల్ 18 కేంద్రాలున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల సమయంలో పరీక్షలు నిర్వహిస్తారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా బోటనీ 5,731, జువాలజీ 5,730, ఫిజిక్స్ 11,980, కెమిస్ట్రీ 11,981, ఇంగ్లిష్ 18,751, ఒకేషనల్ ఫస్టియర్ 5,151, సెకండియర్ 4,001 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 3,594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రం

ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులకు అందజేసే ప్రశ్నాపత్రాన్ని ఇంటర్ బోర్డు నూతన ద్వారా అందజేస్తోంది. కేంద్రాలకు కేటాయించిన ఎగ్జామినర్ల ఫోన్‌లకు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాతనే ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్షలకు అరగంట ముందు ప్రశ్నాపత్రాలు ఆన్‌లైన్‌లో ఉంటాయి. కళాశాలలవారీగా ప్రశ్నాపత్రాల కోడ్‌లు వేర్వేరుగా ఉంటాయి. పరీక్ష సమయానికి అరగంట ముందు హాల్‌టిక్కెట్ ఆధారంగా ఇన్విజిలేటర్ ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసి ఇస్తారు.

ఇంగ్లిష్‌లోనూ ప్రాక్టికల్స్

ఈసారి కొత్తగా ఇంగ్లిష్‌లోనూ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 20 మార్కులకు గానూ.. వచ్చే నెల 16న ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇది విద్యార్థులకు ప్రయోజనకరమని లెక్చరర్లు పేర్కొంటున్నారు. భాషా నైపుణ్యాలను పెంచుకోవడంతోపాటు మార్కుల స్కోరింగ్‌కు దోహదపడుతోదని చెబుతున్నారు.

తేడా వస్తే చర్యలు తీసుకుంటాం



ఇంటర్‌బోర్డు ఆదేశాలమేరకు సంగారెడ్డి జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన సూచనలను కళాశాలలకు చేరవేశాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించాం. హాల్‌టికెట్‌పై ఏమైనా పొరపాట్లు ఉంటే కళాశాల యాజమాన్యాలు అధికారుల దృష్టికి తీసుకురావాలి. ఏ కారణంతోనైనా హాల్‌టికెట్ ఇచ్చేందుకు కాలేజీ యాజమాన్యాలు నిరాకరిస్తే చర్యలు తీసుకుంటాం.

-గోవిందరామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, సంగారెడ్డి

ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌ను ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఫిబ్రవరి 16న ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు మొదటిసారి ఇంగ్లిష్‌లో ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తాం.

- సత్యనారాయణ, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి, మెదక్

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా అశోక్‌గౌడ్ ఎన్నిక

- ఓటింగ్‌లో పాల్గొనని బీజేపీ కౌన్సిలర్లు
- ఎక్స్‌అఫీషియో సభ్యులుగా హాజరైన ఎమ్మెల్యే, ఇద్దరు ఎమ్మెల్సీలు



చైర్మన్‌గా ఎన్నికైన అశోక్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, వెంకట్రామిరెడ్డి

నర్సాపూర్, జనవరి 29: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా డి.అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మురళీధర్‌యాదవ్ రాజీనామాతో కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవడానికి సోమవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా నియమితులైన తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చిన వెంటనే క్యాంపునకు తరలివెళ్లిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు సోమవారం 10.30 గంటలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామ్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలతో కలిసి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. చైర్మన్ ఎన్నిక సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, ఇస్రత్ సిద్దిఖీ, నయిమొద్దీన్, రుక్మమ్మ, లలితాభిక్షపతి, రాంచందర్, సరితాఆంజనేయులుగౌడ్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సునీతాబాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఉన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రామిరెడ్డి, యాదవరెడ్డి కూడా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

బీజేపీకి చెందిన మురళీధర్‌యాదవ్, సురేష్, రాజేందర్, యాదగిరి, లతారమేష్‌యాదవ్, బుచ్చేస్‌యాదవ్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్‌కు అశోక్‌గౌడ్‌ను చైర్మన్‌గా కౌన్సిలర్ రామచందర్ ప్రతిపాదించారు. మరో కౌన్సిలర్ సరితా ఆంజనేయులుగౌడ్ మద్దతు తెలిపారు. ఎవరూ పోటీలో లేకపోవడం, ఒకే పేరు ప్రతిపాదన రావడంతో అశోక్‌గౌడ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి నియామకపత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి చేసి చూపుతా: చైర్మన్

నర్సాపూర్ పట్టణం 20 ఏళ్లుగా అనుకున్న స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని, తన హయంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతానని నూతన చైర్మన్ డి.అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎమ్మెల్సీలు వెంకట్రాంరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపూర్ పట్టణానికి గత ప్రభుత్వం హయాంలో పెద్దమొత్తంలో ప్రత్యేక నిధులు వచ్చినప్పటికీ అప్పటి చైర్మన్ అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. అందరి సహకారంతో తాను పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

సిఫార్సుల కమిటీ సభ్యులుగా రోహిత్‌రావు, చంద్రశేఖర్

జహీరాబాద్/మెదక్, జనవరి 29: నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం సిఫార్సుల కమిటీని హైదరాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మాజీమంత్రి చంద్రశేఖర్‌ను, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావును పునఃప్రారంభ సిఫార్సుల కమిటీ సభ్యులుగా నియమిస్తూ పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పరిశ్రమలశాఖ మంత్రి డా.శ్రీధర్‌బాబును చైర్మన్‌గా నియమించారు. అందులో పలువురిని సభ్యులుగా చేర్చగా జహీరాబాద్‌కు చెందిన మాజీమంత్రి డా.చంద్రశేఖర్‌కు సభ్యుడిగా అవకాశం లభించిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కమిటీ ఏర్పాటుతో నిజాం చెరకు ఫ్యాక్టరీలకు పూర్వ వైభవం సంతరించుకోనున్నదని రైతులు, నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


చంద్రశేఖర్, రోహిత్‌రావు

బియ్యం ఎగవేతదారులపై
రెవెన్యూ రికవరీయాక్టు

సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులకు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్, జనవరి 29: జిల్లాలో పౌర సరఫరాలకు సంబంధించిన బియ్యం ఎగవేతదారులైన మిల్లర్లపై రెవెన్యూ రీకవరీ యాక్టు కింద వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సమీక్షలో మిల్లర్లతో పాటు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలపైన పెట్టిన ఆర్ఆర్ యాక్ట్‌కు సంబంధించిన చర్యలు సత్వరమే తీసుకోవాలని ఆదేశించారు. లక్ష్మీనర్సింహా రైస్‌మిల్, నర్సాపూర్ శ్రీధర్ గుప్తా రైస్ మిల్, మాసాయిపేట చైతన్యా ఆగ్రో, పాపన్నపేట భవానీ రైస్‌మిల్, రామాయంపేట భవానీ రైస్‌మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా బకాయిలు పడ్డ వారిపై ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం వారి స్థిర, చర ఆస్తుల జప్తుకు, ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల్లో బియ్యం అవకతవకలకు పాల్పడ్డ సిబ్బందిపై చర్యలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎం హరికృష్ణ, డీసీఎస్‌వో బ్రహ్మారావు, ఆర్డీవో శ్రీనివాస్, జయచంద్ర అంబదాస్, తహసీల్దార్లు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలో అధిక శాతం పెండింగులో ఉన్న మిల్లుల యజమానులతో ఐడీవోసీ సమావేశ మందిరంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 31తో ముగుస్తుందని ఆలోగా బియ్యం ఇవ్వని మిల్లుల యజమానులపై ఆర్ఆర్ యాక్టు కింద చర్యలు చేపడతామని హెచ్చరించారు.

వచ్చే నెల 13న నర్సాపూర్‌లో శ్రీధర్‌గుప్తా ఆస్తుల వేలం

కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు చెల్లించకపోవడంతో జిల్లాకు చెందిన ఓ రైస్‌మిల్లర్ ఆస్తులు బహిరంగ వేలానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. నర్సాపూర్‌కు చెందిన రైస్‌మిల్లర్ శ్రీధర్‌గుప్తా సీఎంఆర్ బియ్యంకు సంబంధించిన బకాయిలు రూ. 47,17,36,860 చెల్లించాల్సి ఉంది. గడువు తీరిపోవడంతో ఆయన చరాస్తుల్ని వచ్చే నెల 13న ఉదయం 11 గంటలకు నర్సాపూర్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో వేలం ద్వారా విక్రయించనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలియజేశారు. వేలంలో అత్యధిక బిడ్ నమోదు చేసినవారికి భూములు, గృహాలు తదితర స్థిరాస్తులను విక్రయిస్తామని పేర్కొన్నారు.


కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ల ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు

ఈవీఎం, వీవీ ప్యాట్ల ప్రదర్శనతో ఓటర్లకు అవగాహన : సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి రూరల్, జనవరి 29: నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ పక్కాగా చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ, అనుబంధ శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫిబ్రవరి 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 12న మాత్రలు తీసుకోనివారికి 19న అందజేయాలన్నారు. దీనిపై గ్రామాల్లో దండోరా వేయించాలని డీపీవో సురేష్‌మోహన్‌ను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఈవీఎం డెమోనిస్ట్రేషన్ కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి ప్రారంభించారు. పోలింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఓటర్లందరూ అవగాహన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్య, వైద్యారోగ్య శాఖల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అంగన్‌వాడీ భవనాలకు ప్రతిపాదనలు ఇవ్వాలని, ప్రభుత్వ భవనాలు, సీసీరోడ్లు, బీటీరోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి సూరిక్రిష్ణ

జహీరాబాద్, జనవరి 29: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బీసీ బాలుర వసతీగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలని అన్నారు. నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి చట్టాలు దోహదపడుతాయని అన్నారు. బాల్య వివాహాల బాధితులు, బాలకార్మికులను గుర్తిస్తే పోలీసులకు, తహసీల్దార్‌కార్యాలయ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్‌కుమార్, న్యాయవాదులు, ఇబ్రహీం, మహేష్, శేఖర్, జగన్, బ్రహ్మానందరెడ్డి, మహేందర్, లీగల్‌సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు, వసతిగృహ ఇన్‌చార్జి వంశీక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ

నీటిని అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్ సీజ్

కంది, జనవరి 29: కంది మండల పరిధిలోని చేర్యాల, ఇంద్రకరణ్, కంది, కాశీపూర్ తదితర గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇంద్రకరణ్ గ్రామంలో అనుమతులు లేకుండా వ్యవసాయ బోరు ద్వారా నీటినీ తోడి, పరిశ్రమలకు తరలిస్తున్న ఓ ట్యాంకర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో వ్యవసాయానికి ఉపయోగించే నీటిని ఎవరైనా అక్రమంగా ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు, ఇతరత్రా అవసరాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో సీనియర్ అసిస్టెంట్ సంతోష్‌శర్మ, పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

శివ్వంపేట, జనవరి 29: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం దొంతి గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన జోగిని పోచమ్మ, పోచయ్యల చిన్న కుమారుడు రవి(32) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన రవి భార్యతో తరుచూ గొడవపడేవాడు. రవి ఈనెల 27న శభాష్‌పల్లిలోని ఓ పరిశ్రమ వెనుకాల పురుగుమందు తాగి తల్లికి ఫోన్ చేశాడు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

పుట్టకోట భూమి ప్రభుత్వానిదే

● బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

తూప్రాన్, జనవరి 29: తూప్రాన్ పట్టణంలోని పుట్టకోట ప్రాంతంలో అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్న కోట భూమిలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. తూప్రాన్ పట్టణంలోని పుట్టకోట పరిధిలోని రెండు బురుజుల మధ్య ఉన్న భూమికి ఇంటి నంబరు ఏర్పాటు చేసి వేల గజాలు అమ్మకాలు చేశారు. అప్పట్లో ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆ భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ భూమిపై చర్యలకు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ భూమి ప్రభుత్వ భూమి అంటూ సోమవారం బోర్డు పెట్టారు.

విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు

● మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

పెద్దశంకరంపేట, జనవరి 29: విద్యతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో క్యూబ్, రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 54 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పది వేల చొప్పున ఉపకార వేతనం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలస్వామి మాట్లాడుతూ విద్య వికాసాన్ని అందిస్తుందని అన్నారు. అన్ని దానాల్లో కన్నా విద్యా దానం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రభుత్వపాఠశాలలను దత్తత తీసుకొని మౌలిక వసతులు కల్పించాలని ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సీఎస్ఆర్ అనూజ్ మైత్రి మెదక్ డీఎస్పీ ఫణికుమార్, టీఎల్ఎంఎస్‌వి సయ్యద్ అహ్మద్ షేక్, ఆర్‌ఈఎంఎస్‌విఎండీ రెహమాన్‌ఖాన్, అల్లాదుర్గం సీఐ జార్జ్, పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు, పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాన్ని బహూకరిస్తున్న మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి

కొమురవెల్లి ఆలయంలో లష్కర్‌వారం బుకింగ్ ఆదాయం రూ.59 లక్షలు

చేర్యాల, జనవరి 29 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా లష్కర్‌వారాన్ని పురస్కరించుకుని భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులుతీర్చుకున్నందున రూ.59 లక్షల మేర బుకింగ్ ఆదాయం సమకూరినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, రచించిన పట్నాలు, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, వసతిగదుల అద్దె తదితరాల ద్వారా శనివారం రూ.5,97,344, ఆదివారం రూ.45,22,202, సోమవారం రూ.8 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. గతేడాది సుమారు రూ.39లక్షలురాగా ఈయేడాది సుమారు రూ.20 లక్షలు పెరిగింది.

కొంపముంచిన కుమ్ములాటలు

- దుబ్బాక మున్సిపాలిటీలో బాధ్యతను మరిచిన పాలకవర్గం
- శాపంగా మారిన ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం
- పట్టణంలో అభివృద్ధి పనులపై అశ్రద్ధ
- ఫలితంగా గతంలో మంజూరైన నిధులు వెనక్కి

దుబ్బాక, జనవరి 24 : గతంలో దుబ్బాక వేదికగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా నేడు పట్టణ ప్రగతి తిరోగమన దిశలో నడుస్తున్నది. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం మున్సిపాలిటీకి శాపంగా మారింది. నాలుగేళ్లుగా మున్సిపల్ పాలకమండలిలోని కుమ్ములాటలు అభివృద్ధికి ఆటంకంగా మారాయి. పట్టణంలో కొత్త పనులు దేవుడెరుగు.. మంజూరైన వాటిని పూర్తి చేయలేకపోయారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలను మంజూరు చేయించుకుని, ఏళ్ల తరబడి మురగబెట్టి వాటిని రద్దు అయ్యేలా చేశారు.

రూ.10 కోట్ల నిధులు నిలిపివేత

దుబ్బాకలోని 20 వార్డులకు ఏడాది క్రితం టీయూఎఫ్ఐడీసీ కింద రూ.10 కోట్లను మంజూరు చేశారు. వార్డుకు రూ.25 లక్షల చొప్పున పనులు చేపట్టాల్సి ఉండగా పాలకమండలి సమన్వయలోపం కారణంగా సకాలంలో ప్రభుత్వానికి అంచనాలను అందించలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం వాటిని తాత్కాలికంగా నిలిపివేసింది. వీటితోపాటే సిద్దిపేట మున్సిపాలిటీకి మంజూరు అయిన నిధులను వారు సద్వినియోగం చేసుకున్నారు. పాలకమండలి పనులను చేపట్టడంతో సిద్దిపేటలో అభివృద్ధి ఫలితాలు కనిపిస్తున్నాయి. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌ల నిర్లక్ష్య ధోరణితో నిధులు నిలిపివేయబడ్డాయని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సొంత భవనం లేక అతిథి విడిది భవనంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్యాలయం



రామసముద్రం సుందరీకరణలో భాగంగా పూర్తి కాని పాదచారుల రహదారి

మైనార్టీ, బీసీబంధు చెక్‌లు ఇవ్వలేదు

కౌన్సిలర్‌లు, చైర్‌పర్సన్ ఆదిపత్య పోరుతో పట్టణంలో బీసీ, మైనార్టీ సంక్షేమ, ఎస్టీ కార్పొరేషన్ నిధులు లబ్ధిదారులకు అందకుండాపోయాయి. 2021 నుంచి ఎస్టీ కార్పొరేషన్ నిధులను మంజూరు చేసినా ఒక్కరికి ఇవ్వలేదు. 44 మంది బీసీలకు బీసీబంధును మంజూరు చేసి చెక్‌లను సిద్ధం చేసినా వాటి పంపిణీ బాధ్యతను మున్సిపల్ నాయకులు తీసుకోకపోవడంతోపాటు నిలిచిపోయాయి. అంతేకాకుండా మొదటివిడుత 40 మందికి బీసీబంధు చెక్‌లు ఇచ్చినా అందులో వచ్చిన పర్సెంటేజీల వ్యవహారంలో విభేదాలతో తిరిగి తీసుకుని విమర్శలపాలయ్యారు. మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్‌లను ప్రభుత్వం మంజూరు చేసినా వాటిని కలెక్టరేట్‌లోనే ఉంచారు. మైనార్టీబంధు ద్వారా 17 చెక్‌లు సిద్ధమైనా పాలకవర్గం పట్టింపులేనితనంతో వెనక్కిపోయాయి.

డబుల్ బెడ్రూం ఇళ్ల వ్యథ

దుబ్బాక పట్టణానికి ఏడేళ్ల క్రితం వెయ్యి డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేశారు. అందులో ఇప్పటి వరకు 896 ఇళ్లను పూర్తి చేశారు. వీటిలో లబ్ధిదారుల ఎంపిక జరగకుండానే కొంతమంది గృహప్రవేశం చేశారు. అందులో కనీస వసతుల కల్పన కోసం ఇప్పటి వరకు పాలకమండలి పట్టించుకున్న పాపాన పోలేదు. అసలైన లబ్ధిదారులకు ఇప్పటికీ పట్టాలను అందించలేదు. సుమారు 104 ఇళ్లు వెనక్కిపోయాయి. హమాలీ కాలనీలో 84 ఇళ్లు పూర్తి అయినప్పటికీ లబ్ధిదారులకు అందించాలనే బాధ్యతను తీసుకునే నాథుడే కరువయ్యారు.



ఆరేళ్లుగా తెరుచుకోని శ్మశానవాటిక

దుబ్బాక మున్సిపల్ పరిధిలో ఆరేళ్ల క్రితం ప్రారంభించిన వైకుంఠధామం ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. రూ.50 లక్షలతో వ్యయంతో నిర్మించగా చిన్నచిన్న పనులు మినహా నిర్మాణం పూర్తి అయింది. అయినా ఇప్పటికీ గేట్లు తెరుచుకోలేదు. దీంతో పట్టణంలో మృతదేహాలను ఆరు బయటనే దహనం చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. గేటుకు ఎదురుగానే దహన సంస్కారాలు పూర్తి చేస్తున్నారు.

ఎన్నో పనులు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

పాలకమండలి అశ్రద్ధతో ఇప్పటివరకు కనీసం మున్సిపాలిటీకి సొంత భవనానికి కూడా నోచుకోలేదు. రూ.5 కోట్లు మంజూరు అయ్యి రద్దుయ్యాయి. ఐటీఐ కళాశాల భవన నిర్మాణం, రామసముద్రం చెరువుకట్ట సుందరీకరణ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. చైర్‌పర్సన్ సొంత వార్డులో రూ.25 లక్షలతో నిర్మించిన ఉద్యానవనం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. కల్యాణ మండపం సమీపంలో రూ.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ భవనం పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ఎఫ్ఎస్‌డీపీ కిందా మానవ ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని నిర్మించినా వినియోగంలోకి తేలేదు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆడిటోరియం, టౌన్‌హాల్ కథ కంచికే!

పాలకమండలి నిర్లక్ష్యంగా పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఆడిటోరియాన్ని నిర్మించలేకపోయారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు కోసం అప్పటి ప్రభుత్వం రూ.3.80 కోట్లను మంజూరు చేసింది. దీనికి టెండర్ పూర్తయిన కానీ స్థలాన్ని చూపెట్టకపోవడంతో నాలుగేళ్లుగా ఆ నిధులు మురిగిపోతూ వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే, మరిన్ని నిధులను అందిస్తామని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించినా పాలకమండలి శ్రద్ధ చూపలేదు. చివరికి కొత్త ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసింది. కూరగాయాల మార్కెట్ ప్రస్తుతం దుమ్ముధూళితో రహదారుల మధ్య కొనసాగాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇక దుబ్బాకలో ఆడిటోరియం నిర్మాణానికి రూ.2 కోట్లను మంజూరు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సీ.నారాయణరెడ్డి ఆడిటోరియం నమూనాను కూడా పరిశీలించారు. దీనికి స్థల సేకరణ చేయకపోవడంతో నాలుగేళ్లుగా నిధులు మురిగిపోయాయి. చివరికి కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. అధునాతన హంగులతో నిర్మించాల్సిన టౌన్‌హాల్ కథ ఇలాగే ఉంది. ఏడేళ్ల క్రితం నిధులను మంజూరు చేసి అప్పటి సీఎం కేసీఆర్ పనులు చేపట్టాలని ఆదేశించినా పట్టించుకోలేదు. టౌన్‌హాల్ కోసం వేసిన శిలాఫలకవే శిథిలమైపోయింది.



ప్రారంభానికి నోచుకోని చిల్డ్రన్ పార్కు

ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- సమస్యలను పరిష్కరించి నమ్మకం కలిగించండి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జనవరి 29 : ప్రజావాణిలో వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దని అధికారులకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో ప్రజలు వస్తారని వారి సమస్యలను పరిష్కరించి నమ్మకం కలిగించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈ విధంగా ఉన్నాయి. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో పట్టాలు పొందిన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఆ గ్రామస్థులు కోరారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో 2.30 ఎకరాల భూమిలో వంద మంది రైతులు 30 సంవత్సరాలుగా పశుపోషణ చేసుకుంటూ కోళ్ల ఫారాలు నిర్వహిస్తూ బతుకుతున్నారని, ఆ గ్రామ సర్పంచ్ దౌర్జన్యంగా గ్రామ కంఠం భూమి అంటూ అక్రమ కేసులు నమోదు చేశారని ఫిర్యాదు చేశారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని రైతులు కోరారు. సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన నాగమణి తమ భూమిలో పక్క భూమివారు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 27, వివిధ శాఖలకు సంబంధించి 49 దరఖాస్తులు రాగా మొత్తం 76 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలి : మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, జనవరి 29: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ప్రజావాణికి అందిన ప్రతీ ఫిర్యాదుపై స్పందించాలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అదనపు కలెక్టర్లు వేంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో నలుమూలల నుంచి 95 దరఖాస్తులు వచ్చాయి. అందులో భూ సమస్యలు 54, జనరల్ 23, పింఛన్లు 13, ఉపాధి 3, సర్వే, భూరికార్డులపై రెండు వినతులు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజావాణిలో వచ్చిన వాటిని పెండింగ్‌లో లేకుండా పరిష్కారించాని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం డిమోన్స్‌షన్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

అబద్ధాలు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి

జోగిపేట, జనవరి 29: అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి, అసెంబ్లీ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం అందోలు శివార్లలోని ఓ ఫంక్షన్‌హాల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు వ్యూహాలపై ప్రధానంగా చర్చించారు. పార్టీ ముఖ్యకార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యాలు ఏంటో వారికే తెలియడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పరనింద తప్ప చేసేదేంటో మాత్రం చెప్పడం లేదన్నారు. బీఆర్ఎస్‌పై తప్పుడు ప్రచారాలే వారి అజెండాగా మారిందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు కరెంట్, నీటి కష్టాలు లేక సుభిక్షంగా ఉన్నారని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడవక ముందే కరెంట్ కోతలు, నీటి కష్టాలు మొదలయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోయామని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఆపార్టీ ఇచ్చిన హామీలపై నిలదీస్తే ముఖ్యమంత్రి మొదలు మంత్రులకు కోపం వస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారకాంక్షతో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ పనితీరుని క్షేత్రస్థాయి ప్రజలకు వివరించి రాబోయే ఎంపీ ఎలక్షన్స్‌లో భారీ మెజారిటీతో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, మాజీ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాహుల్ కిరణ్, ముఖ్య నాయకులు సాయికుమార్, వీరారెడ్డి, పల్లె సంజీవయ్య, జోగినాథ్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్‌లు, అన్ని మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, సర్పంచ్ లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గుమ్మడిదల శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

పోలీస్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

గుమ్మడిదల, జనవరి 29 : గుమ్మడిదల మండల కేంద్రంలో నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని, ప్లాన్‌ను సోమవారం ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ జాతీయ రహదారి 765-డిని ఆనుకొని, గుమ్మడిదల ప్రైమరీ హెల్త్‌సెంటర్ పక్కన 1.17 గుంటలో అధునాతన హంగులతో గుమ్మడిదల నూతన పోలీసుస్టేషన్ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు హెటిరో గ్రూప్ చేపట్టనున్నట్లు వివరించారు. అయన వెంట హెటిరో గ్రూప్ ఆఫ్ మేనేజర్ రామోమోహన్‌రెడ్డి, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



దరఖాస్తు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 29: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. మొత్తం 27 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన తుర్కపల్లి తండావాసులు

ఒకే తండా నుంచి 9 మంది స్టాఫ్‌నర్సులు

నారాయణఖేడ్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్‌నర్సుల మేల్, ఫీమేల్ ఎంపికకు సంబంధించి ఫలితాలను విడుదల చేయగా నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి తండాకు చెందిన తొమ్మిది మంది ఒకేసారి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల నియామకం కోసం 2022లో నోటిఫికేషన్ విడుదల చేయగా గతేడాది పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేయడంతో తండాకు చెందిన విజయ్, వినోద్, రాజు, మోహన్, సంగ్రాం, చైతన్, రజిత, మౌనిక, ప్రియాంక ఎంపికయ్యారు. తండాకు చెందిన తొమ్మిది మంది స్టాఫ్‌నర్సులుగా ఎంపిక కావడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు నెహ్రూనాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ పోయిందా..

- సీఐఈఆర్‌లో లాగిన్ అయితే త్వరగా పట్టుకుంటాం : సీపీ



సెల్‌ఫోన్‌లను దక్కించుకున్న బాధితులతో సీపీ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 29 : సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఐఈఆర్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేసుకుంటే ఫోన్ ఎక్కడుందో కనిపెట్టవచ్చని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ అన్నారు. పోగొట్టుకున్న 30 సెల్‌ఫోన్లను సీఐఈఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 2001 మంది ఫోన్లు పోయినట్లు గుర్తించామని, వాటిలో 612 సెల్‌ఫోన్లను ట్రేస్ అవుట్ చేసి, 330 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ మల్లారెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఐటీ కోడ్ సిబ్బంది శ్రీకాంత్, స్వప్న, మల్లేశం పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలి

- సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్

జిన్నారం, జనవరి 29 : పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం అయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల్లో నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. కేసుల పరిశోధనకు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్య సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఎస్ఐ విజయ్‌రావు, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

అప్పులు చేసి పనులు చేశాం

● వడ్డీ కట్టలేకుంటున్నాం

● మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీల ఆవేదన



మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జనవరి 29: సర్పంచులుగా కష్టాల్లో ఉండి కూడా గ్రామాభివృద్ధికి పాటుపడ్డామని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం చిన్నశంకరంపేట మండల సమావేశాన్ని ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రారం, అంబాజీపేట సర్పంచులు మంచాల లక్ష్మణ్, సాన సాయిలు మాట్లాడారు. గ్రామాల్లో అప్పులు తెచ్చి అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కానీ సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక సర్పంచులందరం రోడ్డున పడిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల కాలంలో సర్పంచుల బాధలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రోహిత్‌ను ఆహ్వానిస్తే సమయం ఇవ్వలేదని వాపోయారు. పార్టీలు అనేవి ఎన్నికల వరకేనని తర్వాత అందరం కలిసికట్టుగా ఉండడమే లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి సహకరిస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో ప్రవీణ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు యాదగిరియాదవ్, పీఆర్ఏఈ విజయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నిఖిల, ఏవో ప్రవీణ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఐదేళ్ల పదవీకాలంలో సమస్యలు పరిష్కారం కాలే

● మొక్కుబడి సమావేశాలతో సమయం వృధా ● అధికారుల తీరుపై మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల అసహనం

గుమ్మడిదల, జనవరి 29: ఐదేళ్ల తమ పదవీకాలంలో గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం కాలేదని, తూతూమంత్ర సమావేశాలతో సమయం వృధా తప్ప తాము అనుకున్న పనులు చేయలేకపోయామని మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం గుమ్మడిదల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపైన సమావేశంలో చర్చించారు. ప్రతీ సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు మండలంలోని ఆయా గ్రామాల్లోని సమస్యలపై తీసుకున్న చర్యల గురించి వివరిస్తుండగా.. ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మండలంలో ఐదేళ్ల క్రితం ఉన్న సమస్యలు నేటివరకు అలాగే ఉన్నాయన్నారు. సమస్యలపై సమావేశంలో ఎన్నిసార్లు విన్నవించినా ఇప్పటివరకూ పరిష్కారం చూపలేదని వాపోయారు. పరిశ్రమల సహకారం సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న పనుల్లో నాణ్యత లేకపోవడంతో తక్కువ సమయంలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఐదేళ్లుగా పూర్తిస్థాయిలో తమ బాధ్యతను నిర్వహించిన సర్పంచులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం 6 గ్యారంటీలను ప్రజలకు అందేవిధంగా చూడాలని సూచించారు. కాగా వరుసగా ఈ సమావేశాలకు ఇరిగేషన్, పొల్యూషన్‌శాఖల అధికారులు హాజరుకాకపోవడం గమనార్హం. ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎమ్మార్వో కరుణాకర్‌రావు, వైస్ ఎంపీపీ మంజులావెంకటేష్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



గుమ్మడిదల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి

చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● వ్యవసాయ అధికారి శశాంక్

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 29: యాసంగిలో వరి పంటపై చీడపీడల బెడద అధికంగా ఉన్నదని, రైతులు మెళకువలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితేనే పంట ఎదుగుదల ఉంటుందని మండల వ్యవసాయ అధికారి శశాంక్ అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్ శివారులో వరి నాట్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వాతావరణ మార్పులతో వరి నారుకు చీడపీడల బెడద అధికంగా ఉన్నదని, వరి నారు నాటు సమయంలో రైతులు తాము సూచించిన సలహాలు పాటించాలన్నారు. అనంతరం బొక్కస్‌గామ్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు శశాంక్ తెలిపారు.

'మనఊరు-మనబడి' పనుల్లో జాప్యమెందుకు?

నిజాంపేట, జనవరి 29: ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు కల్పించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మనబడి' పనులు కేవలం శంకుస్థాపనలు, శిలాఫలకాలకే పరిమితం తప్ప నేటికీ పూర్తి కాలేదని జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని కోరారు. గ్రామంలో చేసిన పనులకు బిల్లులు సకాలంలో అందడం లేదని, బిల్లులు సకాలంలో చెల్లించేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని తెలిపారు. చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ నిధులు గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా గత పంచాయతీరాజ్ అధికారి, కాంట్రాక్టర్ బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతూ సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. వైస్ ఎంపీపీ అందె ఇందిర, ఎంపీడీవో జగదీశ్వర్‌చారి, తహసీల్దార్ సురేష్‌కుమార్, విద్య, వైద్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ విజయ్‌కుమార్

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు మృతి

నర్సాపూర్, జనవరి 20: నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డుపై సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. నర్సాపూర్ వైపు నుంచి వెళ్తున్న ట్రాక్టర్ రెడ్డిపల్లి వైపు నుంచి నర్సాపూర్ వస్తున్న బైక్ మండలంలోని సీతారాంపూర్ గేటు సమీపంలో ఢీకొనడంతో బైక్‌పై ఉన్న హత్నూర మండలం వడ్డెపల్లికి చెందిన రాజు(40) వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో చెరకు పంట దగ్ధం

● సుమారు రూ.2 లక్షల నష్టం

నిజాంపేట, జనవరి 29: విద్యుదాఘాతంతో చెరకు పంట దగ్ధమైంది. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన సంగెపు శ్రీశైలం రెండు ఎకరాలలో చెరకు పంట వేశాడు. ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల మేర పంట నష్టం వాటిల్లిందని ప్రభుత్వం, విద్యుత్ అధికారులు స్పందించి పరిహారం అందించే విధంగా కృషి చేయాలని బాధితుడు కోరాడు.

విజయ్‌బాబును సస్పెండ్ చేయండి



సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సంగారెడ్డి రూరల్, జనవరి 29: అక్రమాలకు పాల్పడుతున్న మున్సిపల్ అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబును సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ముందు సోమవారం కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి మున్సిపాలిటీలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించారన్నారు. వారి స్థానంలో ఇతరులను డబ్బులు తీసుకుని నియమించారని ఆయన ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న విజయ్‌బాబుని విధుల్లో నుంచి సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సువర్ణ, జనార్ధన్, నర్సింలు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

సంగారెడ్డి టౌన్, జనవరి 29: మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 42 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్కోడా కారును సీజ్ చేయడంతో పాటు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యం కోసం కృషి

మెదక్ అర్బన్, జనవరి 29: గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి పేర్కొన్నారు. సోమవారం మెదక్ మండల పరిధి మక్తాభూపతిపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డలు బలంగా పుడతారన్నారు.

దాతలు చేయూతనివ్వడం సంతోషం: సర్పంచ్

కల్హేర్, జనవరి 29: పాఠశాల అభివృద్ధికి దాతలు చేయూతనందించడం సంతోషకరమని మాసాన్‌పల్లి సర్పంచ్ కమలమ్మ, మాజీ సర్పంచ్ గోపాల్ అన్నారు. గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు పన్నాది రమేష్ గ్రామానికి చెందిన పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న వారి కోసం సేవా కార్యక్రమాలు చేపట్టాడని పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నారాయణఖేడ్, జనవరి 29: హిలిస్టిక్ వైద్యశాల హైదరాబాద్, నారాయణఖేడ్ లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో పీకేఆర్ ట్రస్టు సౌజన్యంతో 30న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో గుండె, సాధారణ, వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరం కొనసాగుతున్నదని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, జనవరి 29: ఖేడ్ ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలతో పాటు మెరుగైన సేవల కోసం సలహాలు, సూచనలు ఇవ్వడానికి 9959223170 నెంబరుకు ఫోన్‌చేయాలని కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళా ప్రదర్శన

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో ఎయిడ్స్ నియంత్రణపై స్థానిక ప్రజలకు కళాకారులు ప్రదర్శన ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రభుత్వ పరంగా అందిస్తున్న సేవలపై వివరించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సత్య జానపద కళాసమితి, చిరంజీవి కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సదస్సుల పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఈవో కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11,12 తేదీల్లో నిర్వహించే ఈ సదస్సులు హైదరాబాద్‌లో ఉంటాయని సంఘం జిల్లా అధ్యక్షుడు సంగయ్య తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి: వెంకటరమణారెడ్డి

నాగల్‌గిద్ద/రాయికోడ్, జనవరి 29: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యకర్తల అభిప్రాయాలను, సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, బీజేపీ నాయకులు రజనీకాంత్, సాయిరాం, పట్నం మాణిక్యం, రాజుస్వామి, సిద్ధయ్యస్వామి పాల్గొన్నారు. బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం రాయికోడ్ మండల పరిధిలోని హస్నాబాద్‌లో బీజేపీ మండల కార్యకర్తల స్థాయి సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సతీష్, నాయకులు సీహెచ్.శ్రీనివాస్, సందీప్‌గౌడ్, సంగన్న, తుకారం, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



క్రిష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంఈవో బస్వరాజ్

జహీరాబాద్, జనవరి 29: విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతమైన హోదాల్లో ఉండేందుకు కృషి చేయాలని ఎంఈవో బస్వరాజ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అల్లీపూర్‌లో గల క్రిష్ణవేణి గ్రూప్ ఆఫ్ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువును ఇష్టంతో కష్టపడి చదువుకోవాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదివించాలని చెప్పారు. సుమారు 600 మంది విద్యార్థులు 40 రకాల ప్రదర్శనలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణవేణ గ్రూప్ ఆఫ్ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది, అధికారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయండి: సీఐటీయూ

సంగారెడ్డి రూరల్, జనవరి 29: బొల్లారంలోని మానాక్సియా పరిశ్రమ యాజమాన్యం అక్రమ లాకౌట్ వేసి కార్మికులను రోడ్డు పాలు చేసిందని, కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో డీసీఎల్ రవీందర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పరిశ్రమ యాజమాన్యం కార్మికులతో ఎలాంటి చర్చలు జరుపకుండా, నష్టపరిహారం చెల్లించకుండా యంత్రాలను తీసుకెళ్లేందుకు కుట్ర పన్నిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజు, విజయ్, లతీష్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి సోమవారం కార్మికశాఖ ఏఎల్‌వోకు సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, ఐఎన్‌టీయూసి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడారు.

ఘనంగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర



బ్యాతోల్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సర్పంచ్ తేర్పల్లి శిరీష

కంది, జనవరి 29: కంది మండల పరిధిలోని బ్యాతోల్ గ్రామంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివార్లకు నైవేద్యాలు సమర్పించారు. ఒగ్గు కళాకారులు ఆలయ ప్రతిష్ఠను కథల రూపంలో గ్రామస్థులకు వివరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అగ్నిగుండాల ప్రవేశం ఉత్కంఠభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సర్పంచ్ శిరీష, గ్రామస్థులు జంగారి సుదర్శన్, రాజుగౌడ్, మన్నె నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహంతో బాధితులకు అన్యాయం

● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే

జహీరాబాద్, జనవరి 29: అధికారుల అత్యుత్సాహంతో బాధితులకు అన్యాయం జరిగిందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామానికి చెందిన బాధితులతో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎల్గోయిలో గ్రామానికి అనుకున్న స్థలాల్లో ఇళ్లను నిర్మించుకుంటే రెవెన్యూ, పోలీస్, వివిధశాఖలకు చెందిన అధికారులు అక్రమంగా నిర్మించుకున్నారంటూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వాటిని కూల్చేసి నిరాశ్రయులుగా మార్చడం పట్ల విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే విధంగా కృషి చేస్తే కాంగ్రెస్ హయాంలో వాటిని కూల్చేయడం దారుణమన్నారు. కూల్చివేతకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుని, బాధితులను ఆదుకోవాలని ఆయన కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్‌పాటిల్, సర్పంచ్ ఓంప్రకాష్‌పాటిల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

● మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 29: తమ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండలం పోచాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మహ్మద్ సదార్ సాబ్ ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఆయన కుమారుడు మహ్మద్ నదీంకు సోమవారం క్యాంపు కార్యాలయంలో రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు.

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏఆర్ డీఎస్పీ

వెల్దుర్తి, జనవరి 29: వెల్దుర్తిలోని పోలీస్‌స్టేషన్‌ను ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎస్ఐ మధుసూదన్‌గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాలోని ఆరు పోలీస్‌స్టేషన్లను సందర్శిస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఏమైనా మరమ్మతులు ఉంటే నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ రంగనాయక్

బీఆర్ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వండి: బీరయ్యయాదవ్

మెదక్, జనవరి 29: తెలంగాణ ఆవిర్భావం కోసం కేసీఆర్‌తో కలిసి అహర్నిశలు శ్రమించా.. ఉద్యమ వ్యాప్తి కోసం ఊరూరా తిరిగా.. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొన్నా.. కానీ ఇంతవరకూ ఎలాంటి పదవులు ఆశించలేదు. బీసీ బిడ్డనైన తనకు మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలని గొల్ల, కురుమ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బీరయ్యయాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. తనకు టికెట్ ఇస్తే బడుగు, బలహీనవర్గాల మద్దతుతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గొల్ల, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక మల్లేష్, మెదక్ విద్యార్థి ట్రస్టు చైర్మన్ కొరైలయ్య, టౌన్ అధ్యక్షుడు శివ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను వినియోగించుకోవాలి: ఎంపీపీ

చేగుంట, జనవరి 29: పల్లె దవాఖానాను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో సోమవారం పల్లె దవాఖానాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో గ్రామాల్లో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొరగల రాములు, నాయకులు భూపాల్, గ్రామస్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టా పాస్ పుస్తకాలు అందజేయాలి

మాసాయిపేట, జనవరి 29: మాసాయిపేట మండలంలోని చెట్ల తిమ్మాయిపల్లిలో గల 158 సర్వే నెంబర్‌లో 50 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన మాసాయిపేటలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. 50 ఏళ్లుగా కాస్తులో ఉన్నవారికి న్యాయం చేయాలని, లేకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఐలయ్య, నాగమణి, బాలమ్మ, చంద్రయ్య రైతులు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు

నిజాంపేట, జనవరి 29: మండల పరిధిలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణ యజమానులు తప్పనిసరిగా ఈ-పాస్ మెషిన్ ద్వారా మాత్రమే ఎరువులు, మందుల అమ్మకాలు జరపాలని, రికార్డులు ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలని ఆదేశించారు.

వైకుంఠపురంలో క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి రూరల్, జనవరి 29: అల్లాదుర్గ్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం ఆలయంలో సోమవారం ఆలయ ప్రధానార్చకుడు వరదాచార్యులు ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు సారా ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, సంఘం నాయకులు ప్రేమ్‌చందర్, జిన్న, హనుమయ్య ఎస్.శ్రీనివాస్, రవి, రవీందర్, విఠల్, సత్తయ్య, మల్లికార్జున్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



అల్లాదుర్గ్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన అర్చకులు వరదాచార్యులు

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులది కీలకపాత్ర

జిన్నారం/చిన్నశంకరంపేట/నర్సాపూర్/చేగుంట, జనవరి 29: గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో సర్పంచులది కీలకమైన స్థానమని ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీడీవో రాములు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ కాలం పూర్తి చేసుకుంటున్న పలువురు మండల సర్పంచులకు సన్మానం నిర్వహించారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో అహర్నిశలు అభివృద్ధి కోసం పాటుపడే సర్పంచ్ పదవీ ఎంతో విలువైనదని అన్నారు. ఎంపీడీవో రాములు, ఎంపీవో సంతోష్, సర్పంచులు పాల్గొన్నారు. సర్పంచుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియడంతో ఎంపీపీ భాగ్యలక్ష్మీగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు సోమవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీడీవో ప్రవీణ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు. నర్సాపూర్ మండల పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని 32 మంది సర్పంచులకు అధికారులు, ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయక్ ఎంపీటీసీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో మార్టిన్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులను ఎంపీపీ సబిత, జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత శంకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు, ఎంపీడీవో ఆనందమేరి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎర్రం అశోక్‌గుప్తా, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



జిన్నారం: సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీడీవో రాములు

సర్పంచుల పదవీకాలం పెంచాలి

నారాయణఖేడ్, జనవరి 29: రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పదవీ కాలాన్ని పెంచాలని నారాయణఖేడ్‌మండలంలోని పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్ రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జగన్‌చారి మాట్లాడారు. తాము సర్పంచులుగా ఎన్నికైన అనంతరం ఎనిమిది నెలల వరకు చెక్‌పవర్ ఇవ్వలేదన్నారు. గ్రామపంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు కావాల్సి ఉన్నదని చెప్పారు. తాము సర్పంచులుగా ఎన్నికైన నుంచి గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశామని, అందువల్ల మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు పదవీ కాలాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు. సర్పంచులు ప్రసాద్, వెంకటేశం, రాజు, స్రవంతీ పరమేశ్వర్, చాప్లిబాయి, సువర్ణప్రభాకర్, విఠమ్మ, నింగమ్మ, జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్ నాయక్ పాల్గొన్నారు.

ఏఎస్ఐ ప్రతాప్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం

మెదక్ అర్బన్, జనవరి 29: మెదక్ టౌన్ ఏఎస్ఐ ప్రతాప్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం దక్కింది. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ బాలస్వామి చేతులమీదుగా పతకాన్ని అందుకున్నారు. 30 ఏళ్లుగా ఎలాంటి రిమార్క్ లేకుండా అందించిన ఉత్తమ సేవలకు ఈ అవార్డు లభించింది. ఏఎస్ఐగా ప్రతాప్ అందించిన సేవలు.. భవిష్యత్‌తరాలకు మార్గదర్శకంగా, వివిధ వర్గాల ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయని సీనియర్ పోలీసు అధికారులు కొనియాడారు.



ఏఎస్ఐ ప్రతాప్‌కు పతకాన్ని ప్రదానం చేస్తున్న ఎస్పీ బాలస్వామి

ఎమ్మెల్యే రోహిత్‌పై హరీశ్‌రావు వ్యాఖ్యలు హాస్యాస్పదం

పాపన్నపేట, జనవరి 29: నిధులను వాడుకోలేక మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు వెనక్కి పంపుతున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దళిత సీఎం నుంచి దళితబంధు వరకు చెప్పిన మాటలన్నీ బూటకమన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు గోవింద్‌నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, శెట్టి శ్రీకాంతప్ప, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

పెద్దశంకరంపేట, జనవరి 29: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. మెడివిజన్ ఐ హెల్త్ కేర్ సెంటర్ వారి సహకారంతో ఈ క్యాంపు నిర్వహించారు. చాలామంది ప్రజలు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్యగారి నర్సింలు, మల్కాపురం మోహన్, బండాల నారాయణ, ప్రభాకర్, మెడివిజన్ ఐ హెల్త్ కేర్ సెంటర్ డాక్టర్ దీప్, సిబ్బంది గిరిష్ రావత్, ఉదయ్‌కుమార్, ఆంజనేయులు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.